విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ఓట్లలో అవకతవకలు లేకుండా చూడాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : కృష్ణా జిల్లాలో ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ఓటర్ల జాబితాలోని చెల్లని ఇంటి నంబర్లు, నకిలీ ఓట్లు లాంటి అవకతవకలను వెంటనే సరిదిద్దాలని కలెక్టర్ బంగ్లాలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుని కోరుతూ శనివారం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని). వినతి పత్రాన్ని అందజేశారు.

కార్మిక, కర్షక డిమాండ్ల సాధనకై మహాధర్నా

విశాలాంధ్ర-గుడివాడ : బీజేపీ పాలనలో రైతులు, కార్మికులు సామాన్య ప్రజలపై అనేక భారాలు వేసిన నరేంద్రమోదీ పాలనలో జరిగే ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో జింఖానా గ్రౌండ్లో 48 గంటలు జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో ఏఐటీయూసీ గుడివాడ కన్వీనర్ గూడపాటి ప్రకాష్‌బాబు, ఆర్టీసీ యూనియన్ నాయకులు రమణ, ముఠావర్కర్స్ యూనియన్ నాయకులు దుంపల వెంకటనరసింహారావుల ఆధ్వర్యంలో మహాధర్నాకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 540 రైతు సంఘాలు, 11 కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో మహాధర్నా జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ మహాధర్నాకు ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పద్మారావు, శ్రీను, సత్యనారాయణ, నాంచారయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి : తాతయ్య

విశాలాంధ్ర-కృష్ణా జిల్లా బ్యూరో : ఈనెల 27, 28వ తేదీలలో జరుగు రైతు కార్మిక మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ కృష్ణా జిల్లా కార్యదర్శి తాతయ్య అన్నారు. మచిలీపట్నం సీపీఐ కార్యాలయం (మోదుమూడి శ్రీహరిరావు భవనం)లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి తాతయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రైతులు కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారి హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని వీటికి వ్యతిరేకంగా రైతు సంఘాలు కార్మిక సంఘాలు పతలపెట్టిన దేశవ్యాప్త మహాధర్నాలో భాగంగా ఈనెల 27 28 తేదీలలో జరిగే మహాధర్నాకు జిల్లా రైతులు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తాతయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు లింగం ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ జాషువాను మర్యాదపూర్వకంగా కలిసిన సబ్ ఇన్‌స్పెక్టర్లు

విశాలాంధ్ర-మచిలీపట్నం : సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో ఎస్సైలుగా బాధ్యతలు స్వీకరించిన మోపిదేవి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వై.వీర వెంకట సత్యనారాయణ, బందరు తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి పద్మ బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ జాషువాని మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. సిబ్బందిని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ నూతన ప్రదేశంలో బాధ్యతలను స్వీకరించి, శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి, నేర నియంత్రణకు తమదైన పాత్రను పోషిస్తూ, అవినీతికి తావు లేకుండా అసాంఘిక శక్తులను అణిచివేయడంలో కీలకంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని తెలిపారు.

ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని, దేశంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగి అభివృద్ధి సాధించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక పథకాలు ప్రవేశ పెట్టారని కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని మొవ్వమండలంలోని కాజలో శనివారం ప్రారంభించారు. పేకేటి నరసారెడ్డి జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు కేంద్ర పథకాలు అవగాహనకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో అర్హులందరికీ కేంద్ర పథకాల అందాలనే లక్ష్యంతో వికసిత్.భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని పథకాలు నేరుగా, మరి కొన్ని పథకాలు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా గ్రామీణ ప్రాంతంలో 17 పథకాలు, పట్టణ ప్రాంతాల్లో 17పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని తొలిసారిగా పామర్రు నియోజకవర్గంలోని కాజ గ్రామంలోనే నిర్వహిస్తున్నామని, నేటి నుంచి ఈ కార్యక్రమం జనవరి 26 వరకు జరుగుతుందని చెప్పారు. రైతు భరోసా పథకం కింద రూ.6 వేలను కేంద్రం లబ్ధిదారులకు అందిస్తుందన్నారు. ఈ పథకాలు అందని వారికి అందజేయటం అభివృద్ధిలో భాగస్వాములు చేయటం దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ పథకాలు పొందని వారి పేర్లు నమోదు చేసుకొని ప్రయోజనం పొందాలన్నారు. ఆరోగ్యానికి సంబంధించి ఇప్పటికే జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించుకున్నామని అదేవిధంగా సైతం ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని గ్రామస్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు రైతులు వివిధ వర్గాల ప్రజలు అధికంగా భాగస్వామ్యం కావాలని సూచించారు. సభలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్స్ అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన శాఖల స్టాల్స్ ను సందర్శించి నిర్వా హకులను అభినందించారు. సభా ప్రాంగణంలో ఉజ్వల గ్యాస్ కనెక్షన్ రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి ఏకపాత్రాభినయం ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. సర్పంచి కొడాలి భవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మందా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు పేకేటి వెంకటలక్ష్మి, ఎల్లమల్లి కుటుంబరావు, సీఈవో వీర్ల జ్యోతిబాసు, డిపిఓ నాగేశ్వర నాయక్, డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్, డీఎస్ఓ పార్వతి, డిఎంహెచ్ఓ డాక్టర్ జె.గీతా బాయి, ఉయ్యూరు ఆర్డిఓ దాసిరాజు, తహశీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి సుధాప్రవీణ్, సిడిపిఓపి పార్వతి, పీహెచ్సీ వైద్యాధికారిసోమరాజు, ఆయుర్వే ఆయుష్ వైద్యురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రాజ్యాంగం తల్లి వంటిది

విశాలాంధ్ర-మచిలీపట్నం : ప్రపంచ దేశాల్లో అన్ని రాజ్యాంగాలకన్నా భారత దేశ రాజ్యాంగంకి ఎంతో గుర్తింపు వుందని కృష్ణా జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నం శెట్టి రాజు అన్నారు. కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్ట్ ప్రాంగణంలో న్యాయమూర్తులు న్యాయవాదులు న్యాయశాఖ సిబ్బంది కక్షిదారులతో ఏర్పాటు చేసిన జాతీయ లాడే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలని, రాజ్యాంగ ఉల్లంఘన జరిగినప్పుడు హైకోర్టులు సుప్రీంకోర్టు సుప్రీంకోర్టు రక్షణగా ఉంటాయని తెలియజేశారు. భారత రాజ్యాంగం తల్లి వంటిదని ఎన్ని చట్టాలు వచ్చినా భారత రాజ్యాంగానికి లోబడి ఉండాలని ఆయన అన్నారు. బిఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో ఎందరో మేధావులు ఒకే వేదికపై చేరి సమకూర్చిన రాజ్యాంగం భారత రాజ్యాంగం అని ప్రపంచ దేశాలలో భారతదేశానికి ఒక గుర్తింపు పొందిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన హక్కులతో పాటు విధులను కూడా తెలుసుకోవడం జరగాలన్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించకుండా ఉండటం, జాతీయ పతాకాన్ని గౌరవించడం, తోటి మానవుల్ని సమానంగా చూడటం వంటి ప్రాథమిక విషయాలు అందరూ పాటించాలని ఆయన కోరారు. కృష్ణాజిల్లా పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ విశ్రాంత జిల్లా జడ్జి డాక్టర్ రామకృష్ణ భారత రాజ్యాంగంలోని ముఖ్య అంశాలను తెలియజేశారు. ప్రజల యొక్క హక్కులను కాపాడడానికి బిఆర్ అంబేద్కర్ సారధ్యంలో1949 నవంబర్ 26న భారత రాజ్యాంగం రూపొందించారని 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చిందని ఆయన తెలియజేశారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య భారత రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన హక్కులను ప్రజలకు నిరంతరం తెలియజేసే కార్యక్రమాల్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా జాతీయ లాడే ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మ భారత రాజ్యాంగంలో ప్రజలకు సంక్రమించిన ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో ముఖ్య అంశాలను తెలియజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగలహరి భారత రాజ్యాంగాన్ని అమలు చేయడంలో న్యాయమూర్తులు న్యాయవాదులు కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లంకిశెట్టి బాలాజీ , పలువురు న్యాయమూర్తులు న్యాయవాదులు న్యాయశాఖ సిబ్బంది కక్షిదారులు పాల్గొన్నారు.

కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

విశాలాంధ్ర-కృష్ణా జిల్లా బ్యూరో : తీవ్ర వర్షాభావంతో రైతులు పంట నష్టపోయిన నేపథ్యంలో కృష్ణాజిల్లాను కరువు జిల్లాగా ప్రభుత్వం ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు లైన తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల సోమశిల, కండలేరు, వెలుగోడు ప్రాజెక్టులలో గత సంవత్సరం నవంబర్ 22 నాటికి 742 టీఎంసీలు నీరు ఉంటే ఈ సంవత్సరం 293 టీఎంసీలు మాత్రమే ఉన్నదన్నారు. దీనివల్ల రాష్ట్రంలో లక్షల హెక్టార్లు పంట వేయలేదన్నారు. వర్షాలపై ఆశతో పంట వేసుకున్న రైతులు కరువుతో పంట నష్టపోయారని చెప్పారు. పెట్టుబడి పెట్టి పంట చేతిరాక అప్పుల పాలైన రైతులకు పంట బీమా అందించాలని, బ్యాంకు రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు లింగం ఫిలిప్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలు గా ప్రకటించాలని కోరారు. సీపీఐ నాయకులు పాండురంగారావు మాట్లాడుతూ ఖరీఫ్ లో తీసుకున్న అన్ని పంట రుణాలకు మాఫీ చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు సక్రమంగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువులకు పశుగ్రాశం గ్రామీణ పేదలకు 6 నెలల కాలం నిత్యవసర సరుకులు ఉచితంగా అందజేయాలని కోరారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎలిషా

విశాలాంధ్ర-అవనిగడ్డ : అండర్ 14 కబడ్డీ లో రాష్ట్రస్థాయి పోటీల్లో బి.ఎలీషా ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. పులిగడ్డ గురుకుల పాఠశాల విద్యార్థి ఎలీషా రాష్ట్ర స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి స్థాయి స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడని ప్రిన్సిపాల్ ఎస్.టి.పి కుమార్ శనివారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో తెలిపారు. ఈ నెల 18 నుండి 20 వ తేది వరకు అన్నమయ్య జిల్లాలోని చిట్వాలా లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలలో పాల్గొని ఆటలో మంచి ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి అర్హత సాధించాడన్నారు.

మొవ్వలో రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ వియస్ఆర్.ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి అధ్యక్షతన పొలిటికల్ సైన్స్ లెక్చరర్. డాక్టర్ ఎం.సుందరరావు ఆధ్వర్యంలో శనివారం రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం, ఎన్సిసి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి మాట్లాడుతూ నవంబర్ 26న ఇండియా... రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకోవటం ఆనవాయితీ అన్నారు. జాతీయ చట్ట దినోత్సవంగా కూడా జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ చేత ప్రతిజ్ఞ చేయించారు.. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేర్ మంజుల, నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ఎల్. వి కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా 76వ ఎన్‌సీసీ దినోత్సవం

విశాలాంధ్ర-మచిలీపట్నం : 90 సి ఓ వై, 16(ఏ) బి ఎన్ ఎన్ సి సి యొక్క క్యాడెట్లు 76వ ఎన్సిసి దినోత్సవాన్ని అసోసియేట్ ఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ డా.డి.రామశేఖరరెడ్డి ఆధ్వర్యం లో అల్లూరి సీతా రామరాజు ఆడిటోరియంలో జరుపుకు న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.జ్ఞానమణి హాజరయ్యారు. వీసీ తన ఎన్సిసి రోజుల గురించి కొన్ని మాటలు మాట్లాడారు. క్యాడెట్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎన్‌సిసిలో తన యవ్వన రోజులను గుర్తు చేసుకున్నారు .కృష్ణా యూనివర్శిటీ రిజిస్ట్రార్ డా.పి.వీర బ్రహ్మాచారి క్యాడెట్లను ఉద్దేశించి కొన్ని మాటలు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మన కృష్ణా యూనివర్సిటీ ఎన్‌సీసీ విభాగం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని అన్నారు. కృష్ణా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా.ఆర్.విజయ కుమారి మాట్లాడారు చివరగా 90సి ఓ వై, 16(ఏ) బి ఎన్ ఎన్సిసి అసోసియేట్ ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డా.డి.రామశేఖర రెడ్డి క్యాడెట్లతో మాట్లాడారు.

ప్రకటన

నా క్లయింటు అయిన శుభం హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, విజయవాడ వారి సంజాయిషీతో తెలియజేయునది. కృష్ణాజిల్లా, నరసింహారావుపాలెం గ్రామ కాపురస్తులు మిద్దె చెన్నయ్య గారి కుమారుడు మిద్దె వెంకటేశ్వరరావు గారు దిగువ షెడ్యూలు ఆస్తిని హామీగా ఉంచుకొని లోను మంజూరు చేయవలసినదిగా నా క్లయింటు ఫైనాన్స్ కంపెనీ వారిని కోరి ఉన్నారు. దిగువ షెడ్యూలు ఆస్తిని మిద్దె మల్లయ్య గారు వారి స్వార్జితంగా క్రయ దస్తావేజు నెంబరు. 708/1963 ద్వారా సంపాదించుకొని వారి జీవితకాలము సర్వ, సంపూర్ణ, స్వాధీన, హక్కుభుక్తములతో అనుభవించుచూ స్వర్గస్తులైనారనిన్నీ, వారి మరణానంతరం సదరు ఆస్తి వారి ఏకైక వారసుడైన మిద్దె చెన్నయ్య గారికి వారసత్వంగా సంక్రమించినదనిన్నీ, తదాది సదరు మిద్దె చెన్నయ్య గారు వారి మరొక కుమారుడైన నాగ మల్లేశ్వరరావు గారితో కలిసి, తన పెద్ద కుమారుడైన మిద్దె వెంకటేశ్వరరావు గారికి దిగువ షెడ్యూలు ఆస్తిని దఖలు పరిచి అందుకు నిదర్శనముగా ది.03-03-2020వ తేదీన విస్సన్నపేట సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దఖలు దస్తావేజు నెం.1229/2020గా రిజిస్టర్ చేయించి నారనిన్నీ, తదాది సదరు మిద్దె వెంకటేశ్వరరావు గారు సర్వ, సంపూర్ణ, స్వాధీన, అనుభవ హక్కు భుక్తములతో, దాన, దమన, వినిమయ, విక్రయాది యావత్తు హక్కులతో అనుభవించుచున్నారనిన్నీ తెలియజేసినారు. కావున షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనను చెల్లదగిన అభ్యంతరములు, హక్కులు, క్లయిములు, అప్పులు, ఇంజక్షన్లు, ఇతర దావా తగాయిదాలు వగైరాలు ఉన్నయెడల వారు 7 రోజుల లోపు వ్రాతపూర్వకముగా రిజిష్టర్డు పోస్ట్ ద్వారా తెలియజేయవలయును. లేని యెడల షెడ్యూలు ఆస్తి నిర్వివాద ఆస్తిగా పరిగణించి నా క్లయింటు లోను ప్రాసెస్ పూర్తి చేయుదురు. దరిమిలా వచ్చు క్లయిములు నా క్లయింటును బైండు చేయజాలవు. **షెడ్యూలు:** కృష్ణా జిల్లా, చాట్రాయి మండలం, చనుబండ గ్రామ పంచాయితీ ఏరియాలోని, చనుబండ గ్రామ ఆర్.సర్వే.నెం.1300/2 దాఖలా వ.గ.363లు నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** రాస్తా, **దక్షిణం:** పంచాయతీ రోడ్డు, **పడమర:** మిద్దె సత్యనారాయణ గారి స్థలము, **ఉత్తరం:** తల్లాడ రామ నరసింహ గారి స్థలము.

అంబటి సంజయ్ కుమార్, న్యాయవాది
డోర్ నెం.24-25-73
2వ క్రాస్ రోడ్, బాలాజీ నిలయం
విజయవాడ దుర్గాపురం, విజయవాడ-3
తేది:25-11-2023. సెల్: 9849077779

27న సంగీత నీరాజనం

విశాలాంధ్ర-కూచిపూడి : కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 10 నుంచి 12వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించే"కృష్ణవేణి సంగీత నీరాజనం' సందర్భంగా ఈనెల 27న వేణుగోపాలస్వామి ఆలయంలో సంగీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహాశీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. ఆలయ అర్చకులు, దేవాలయ అధికారులతో సమీక్షించారు. ఈనెల 27న రాష్ట్రంలో 6 విశిష్టమైన ప్రదేశాలలో సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహి స్తారని దానిలో భాగంగానే కృష్ణా జిల్లా లోని మొవ్వ శ్రీవేణుగోపాలుని సన్నిధిలో ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు (విజయవాడ), బెంగ ళూరుకు చెందిన విద్వాంసులు ఎస్ఆర్ వినయ్ మరియు కే రమేష్ లతో గాత్ర కచేరీ కార్యక్రమాలు సంగీత అభిమానులు విరివిగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహిళలు చైతన్యవంతులైతేనే సమాజంలో మార్పు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మహిళలు చైతన్యవంతులు అయితేనే సమాజంలో మార్పు అనివార్యం అవుతుందని ఐఏఎస్ అధికారి కాకి సునీత తెలిపారు. ఈ నెల 25న మహిళలు, బాలికలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా శనివారం దళిత స్త్రీ శక్తి అధ్వర్యంలో దళిత, ఆదివాసీ స్త్రీలు,బాలికలపై జరుగుతున్న హింసను రూపుమాపాలని కోరుతూ ఒక సభ నిర్వహించారు. ఈ సభకు దళిత స్త్రీ శక్తి జాతీయ అధ్యక్షురాలు ఝాన్సీ గెడ్డం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐఏఎస్ అధికారి సునీత 16 రోజుల ప్రచారోద్యమం చాలా ప్రాముఖ్యతతో కూడుకుందని ఈ పనిని దళిత స్త్రీ శక్తి చేపట్టడం గర్వకారణం అన్నారు. హింస లేని సమాజం రావాలంటే పేద స్త్రీలు చైతన్యంతో పాటు విద్యావంతులైతే కుటుంబం మొత్తం విద్యావంతులు అవుతారన్నారు.చెడు మార్గంలోనికి వెళ్ళకుండా యువతను చైతన్య చేయవలసిన అవసరం అందరిపై ఉందన్నారు ఆర్థికంగా స్థిరపడితే సగం బానిసత్వం పోతుందన్నారు. ప్రభుత్వాల పనితీరులో చిత్తశుద్ధి అవసరం అన్నారు.స్త్రీల పట్ల వ్యవస్థలు రెండు నాల్కల ధోరణి ఉండటం వల్లనే మార్పు అసాధ్యమవుతుందన్నారు. వేదాల్లో దేవతగా వర్ణించడం,వాడుకలో బానిసకంటే హీనంగా చూసే భావజాలం కలిగి ఉండటం, భోగవస్తువుగా చూసే కోణం ప్రబలి ఉండాల్సిన అత్యాచారాలు పేరిగిపోతుండటం పట్ల ప్రభుత్వాలకు సిగ్గుచేటన్నారు. ఈనెల 30న విజయవాడలోని అంబేద్కర్ భవన్ లో దళిత ఆదివాసీ స్త్రీల పై జరిగిన 30 హింసాత్మక సంఘటనలపై సదస్సు,6న లీగల్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నాము అన్నారు.డిసెంబర్ 10వ తేదీన మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో "మానవ హక్కులు- వన్ స్టెప్ ఫార్వర్డ్, టూ స్టెప్స్ బ్యాక్ వర్డ్" అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత స్త్రీ శక్తి కో-అర్డినేటర్స్ కుమారి, మేరీ నిర్మల, రోహిణీ, రోజా, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్షత సమాజానికి సిగ్గుచేటు

విశాలాంధ్ర-ఘంటశాల: ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో ఆ దేశం సుభిక్షంగా ఉంటుందనీ, కానీ ఈ దేశంలో దానికి భిన్నంగా ఉందనీ, మహిళలపై వివక్షత చూపటం ఈ సమాజానికే సిగ్గు చేటనీ స్థానిక ఎంపీడీఓ టి. అనూహ్య పేర్కొన్నారు. శనివారం ఘంటశాలలోని శ్రీశక్తి భవన్‌లో జెండర్‌కు ఆధారిత హింసకు వ్యతిరేకంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొని ఎంపీడీఓ మాట్లాడుతూ నేడు మహిళలు సమాజంలో అనేక రకాల వివక్షలకు గురౌతున్నారనీ, మహిళలు వాటిని దీటుగా ఎదుర్కొని నిలబడాలన్నారు. అప్పుడే పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన భాగస్వామ్యం లభిస్తుందన్నారు. 25 నుంచి డిసెంబర్ 23 సదస్సులు నిర్వహించాలనీ యం.పి.డి.ఓ. వి.ఓ.ఏ లకు ఆదేశించారు. ముందుగా వెలుగు కార్యాలయం నుంచి లింగ వివక్షతపై వి.ఓ.ఏలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి కె.జె. శ్రీనివాస్‌చెందు, ఎంపీఎం అమలేశ్వరావు, సి.సి.లు యం. ఝాన్సీలక్ష్మీ, వి.ఓ.ఏలు, పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : విద్యా ర్థులు పోటీ పరీక్షల్లో రాణించాలంటే భారత రాజ్యాంగంను ఖచ్చితంగా చదవాలి అని కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి పేర్కొన్నారు. సంవిధాన దివస్ పురస్కరించుకొని విశ్వవిద్యాలయ ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎక్కువ కాలం రచించబడిన రాజ్యాంగం భారత రాజ్యాంగం అన్నారు. అమెరికాలో ప్రతి ఒక్కరి దగ్గర రాజ్యాంగం వుంటుందని, మన దేశంలో కూడా ప్రజలు అలాంటి అలవాటు ను అలవర్చుకోవాలి అని వివరించారు. రాజ్యాంగ రచన సమయంలో డా అంబేద్కర్ ఎన్నో నిద్ర లేని రాత్రులు గడపడం వల్ల ఆయన ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినడంతో ప్రాణాలు కోల్పోవల్సి వచ్చిందని అయిన ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త దా శ్రావణి అధ్యక్షతన జరిగిన సభలో రిజిస్ట్రార్ డా వీరాబ్రహ్మాచారి విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై కె సుందరకృష్ణ, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, ఫార్మసీ కళాశాల విభాగాధిపతి ఆచార్య మారుతి తదితరులు ప్రసంగించారు. తొలుత బాబాసాహెబ్ డా బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా స్వరూపరాణి, డా శాంతికృప, డా కవిత, డా సుజయ్, డా శేషరెడ్డి, డా రాణి, పిడి గోపి తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి రైతుల సంక్షేమమే ధ్యేయం

విశాలాంధ్ర-పమిడిముక్కల : గ్రామాల్లో పశుపోషణ చేసే రైతుల సంక్షేమమే విజయ డైరీ ధ్యేయమని కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అన్నారు. శనివారం పామర్రు క్లస్టర్ పరిధిలోని ముళ్ళపూడి, హనుమంతపురంలో సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలు జాతి రకాల పశువులు సెమెన్, దాణాలు వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పై అవగాహన ఏర్పరచారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పక్కాల అంజిబాబు,జిల్లా బోర్డు డైరెక్టర్ వేమూరి సాయి వెంకట రమణ మేనేజర్ సిహేచ్.గోపినాద్ పాల ఉత్పత్తి రైతులు, సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన అనూహ్య

విశాలాంధ్ర-ఘంటశాల: ఘంటశాల మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా నూతనంగా బాధ్యతులు చేపట్టిన టి. అనూహ్యను మండల వ్యవసాయ అధికారి కె.మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏ.ఓ మురళీకృష్ణ మాట్లాడుతూ పాడి ప్రొక్యూర్‌మెంట్ ఎలా జరుగుతుంది, ఈ క్రాఫ్ ఎన్ని ఎకరాలలో చేసారో రైతులకు రైతు భరోసా కేంద్రాలు ఎలా ఉపయోగపడుతున్నాయో దానికి సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేశామనే వివరాలను యం.పి.డి.ఓ అనూహ్యకు క్షుణ్ణంగా వివరించారు. ఆయనతో పాటు వి.ఏ.ఏ.లు జి.రేవతి, మీర్జాయూసఫ్ ఆలి,బి.దిలీప్, బి.సత్యదేవ్, వి.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షతపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-కూచిపూడి : సమాజంలో ఉన్నత విద్యావంతులుసైతం లింగ వివక్ష చూపుతున్నారని ఇది చట్టరీత్యా నేరమైనా నేటికీ కొనసాగుతూనే ఉందని ఎంపీపీ కొండేటి ఇందిర ఆవేదన వ్యక్తం చేశారు. మొవ్వ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వైయస్సార్ క్రాంతి పదంకార్యాలయంలో శనివారం లింగ వివక్షత పై జాతీయ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ఆడవాళ్లు సమాజంలో ఉన్నత స్థానానికి ఎదిగి శాసించే స్థాయికి వెళ్లినా వారిపై చిన్న చూపు చూడటం బాధాకరంగా ఉంటుందన్నారు. దేశాన్ని మహిళలు పాలిస్తున్న ఈ రోజుల్లో కూడా ఇది కొనసాగటం పై ఆమె ఆందోళనలు వ్యక్తం చేస్తూ, మహిళలపై వివక్షను రూపుమాపటానికి ప్రభుత్వాలు సైతం ముందుకు రావాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అబ్దుల్ సలీ మున్నీసా, మహిళా పోలీస్ రేవతి, ఏపిఎంసిహెచ్ ప్రధాన్ రావు, వివో ఏలు, డ్వాక్రా మహిళలుపలువురు పాల్గొన్నారు.

పేదలను ధనికులను చేయుటమే టీడీపీ-జనసేన మేనిఫెస్టో : బొడ్డు

విశాలాంధ్ర-పెడన : సూపర్ సిక్స్ పథకాలతో పేదలను ధనికులను చేయటమే తెలుగుదేశం జనసేన పార్టీల మ్యానిఫెస్టో లక్ష్యమని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. శనివారం స్థానిక 18వ వార్డులో బాబు శ్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం పార్టీ నాయకులతో కలసి ఇంటింటా తిరుగుతూ బాండ్లను అందజేశారు.ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూబాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంనకు ప్రజల్లో విశేష స్పందన వస్తుందని అన్నారు. మనకు అన్నం పెట్టే రైతుకు "అన్న దాత" పేరుతో సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామని, ప్రతీ ఇంటికి దీపం పథకం ద్వారా అర్హులైన ప్రతీ ఇంటికి 3 గ్యాస్ సిలిండర్స్ ఉచితం గా ఇస్తామని, మహిళల కు జిల్లా లో ఉచితంగా ఆర్టీసీ బస్ ప్రయాణసౌకర్యం కలిపిస్తామని వివరించి, మరిన్ని సంక్షేమ పథకాలు మళ్ళీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటిస్తారని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి సేనాపతి అజయ్ కుమార్,రాష్ట్ర ఐటీడీపీ నాయకులు కొనకళ్ళ శివ శంకర్,చింతగుంట తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు భారీగా తరలిరావాలి

ఆటోల జాతాలు ప్రారంభించిన ప్రచార కమిటీ

విశాలాంధ్ర-విజయవాడ : విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే మహా ధర్నా జయప్రదం చేయాలంటూ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో శనివారం మూడు ఆటో జాతాలు ప్రారంభించారు. ఈ ఆటో జాతాలు విజయవాడ పరిధిలోని మూడు నియోజకవర్గాల కేంద్రాలలో రెండు రోజుల పాటు పర్యటించి జనాన్ని చైతన్యవంతం చేసి ధర్నాకు రావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార జాత ప్రారంభానికి ప్రచార కమిటీ కన్వీనర్లు ఎస్.వెంకటసుబ్బయ్య ఏఐటీయూసీ, కృష్ణయ్య రైతు సంఘం నాయకులు పాల్గొనగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు ఏవీ నాగేశ్వరరావు రామకృష్ణ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక రైతన్న వ్యతిరేక విధానాల అవలంబిస్తూ దేశ సంపద కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టడానికి పెట్టుబడిదారీ విధానాలను ప్రోత్సహిస్తుందన్నారు. సామ్రాజ్యవాదం ఆర్థిక నయా ఉదారవాద విధానాలను ముందుకు తీసుకెళ్తూ పబ్లిక్ సెక్టార్‌ను ధ్వంసం చేస్తూ దేశ స్వావలంబన దెబ్బతీస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. మరోవైపు మతోన్మాద రాజకీయాలు నడుపుతూ దేశంలోని మైనార్టీ ప్రజలకు రక్షణ లేకుండా పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రధాని మోదీకి దాసోహం చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులు రైతులు ప్రజలు త్యాగాలతో నిర్మించుకున్న 32 మంది ప్రాణాల బలిదానాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతున్న ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా విభజన హామీలను నెరవేర్చుకున్న పల్లెత్తి ఒక్క మాట కూడా నరేంద్ర మోదీని అడగకపోవడం చాలా దుర్మార్గమన్నారు. ఈ నేపథ్యంలో ఈ రైతు కార్మిక మహా ధర్నాకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దయా,రమాదేవి,ఆర్వీ నరసింహారావు,దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజ్ పనులు మేయర్ పరిశీలన

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేసన్ : నగరంలోని 43వ డివిజన్ ఊర్మిళా నగర్, కబేళా రోడ్‌లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మరమత్తు పనులను నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 అడుగుల లోతులో ఉన్న డ్రెయినేజ్ మరమత్తు పనులు జరుగుతుండటం వల్ల ఎలాంటి అంతరాయం లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కనెక్షన్ తీసుకోనివారు త్వరగా కనెక్షన్లు తీసుకోవాలని సూచించారు. తద్వారా మురికి నీరు నది ప్రవహంలో కలవకుండా ప్రాసెస్ జరిగి కలుషితం కాకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

కార్మిక రైతు మహాధర్నాను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మోదీ బిజెపి కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఈనెల 27,28 తేదీలలో జింఖానా గ్రౌండ్ లో జరిగే కార్మిక, రైతు మహాధర్నా ను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ.ఎఫ్.టీ.యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. పోలారి పిలుపునిచ్చారు. శనివారం క్రీస్తు రాజపురంలోని రామ నర్సయ్యభవన్‌లో మహా ధర్నా కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విధానాల వలన కార్మికులు,ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజానీకం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధరలు సూచి పెరుగుదల నిత్యవసర వస్తువుల ధరల ప్రభావాన్ని తెలియజేస్తున్నదన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్ లు తెచ్చారని చెప్పారు.ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేయటం,లీజు కి ఇవ్వటం జరుగుతున్నదని. రైల్వే , విద్యుత్, టెలికం, బ్యాంకు, బీమా, మౌలిక సదుపాయాల పై ఈ విధానాల దుష్ప్రభావం పడిందన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా 500కు పైగా రైతు సంఘాలు ఉన్న సంయుక్త కిసాన్ మోర్చా,400కు పైగా ఉన్న కార్మిక,ఉద్యోగ,ప్రజా సంఘాలు సమైక్యంగా ఈనెల 27 నుండి మూడు రోజుల పాటు మహా పడావ్ అన్ని రాష్ట్రాలలోనూ నిర్వహిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టీ.యూ నాయకులు ముని శంకర్,డి.శ్రీనివాసరావు,సీ.హెచ్.పెద్దిరాజు,డి .శ్రీధర్ బాబు,పి.రఫీ ఖాన్,కామేష్,వై.అప్పారావు రఘు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై వివాదం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో ఇంటి నిర్మాణానికి మట్టి తరలింపు విషయంలో తిరువూరు, మైలవరం నియోజకవర్గాల మధ్య వ్యాపారులకు వివాదం తలెత్తింది. మైలవరం నియోజకవర్గంలోని రెడ్డిగూడెం మండలం మద్దుల పర్వకు చెందిన పలువురు వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారం మట్టి తరలిస్తున్నా అధికమొత్తంలో గతం నుంచి మట్టి తరలిస్తున్నా, ఇక్కడి అధికారులు కనీసం కన్నెత్తి చూడటంలేదని విస్సన్నపేట వ్యాపారులు వాపోతున్నారు. విస్సన్నపేట వ్యాపారులు ఎవరికి మట్టి తరలించాలన్నా, పలురకాల అనుమతుల పేరుతో వేధింపులకు పాల్పడుతూ, పెద్దఎత్తున జరిమానాలు విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అప్పులు చేసి కొనుగోలు చేసిన తమ ట్రాక్టర్లు నడిపేందుకు ఆస్కారంలేక, పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని ట్రాక్టర్ల యజమానులు, వాటిని నిర్వహించే మట్టి తరలింపుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం నియోజకవర్గానికి చెందిన కొందరు అధికారపార్టీ నేతల అండతోనే ఇవి సాగుతున్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో తమకు మట్టి తరలించుకునే అవకాశం లేకుండా చేసి, యధేచ్చగా ఇతర మండలాల వ్యాపారులకు అవకాశం కల్పించటంపై శుక్రవారం సాయంత్రం ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలువురు ట్రాక్టర్ల యజమానులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. అధికారులు దీంతో శుక్రవారం సరైన అనుమతులు లేకుండా ఇతర మండలాల నుంచి విస్సన్నపేట మండలంలోకి వస్తున్న పలు వాహనాలపై దాడులు నిర్వహించగా, మద్దులపర్వ నుంచి మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. ఒక్కొక్క వాహనానికి రూ.3వేల వరకు జరిమానా విధించినట్లు అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో శనివారం పెద్దఎత్తున మద్దులపర్వ నుంచి మట్టి తరలిస్తున్న వాహనాలను స్థానిక ట్రాక్టర్ల యజమానులు అడ్డుకుని అధికారులకు పట్టించారు. శనివారం నిర్వహించిన దాడుల్లో తొమ్మిది ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రెవిన్యూ అధికారులు తెలిపారు.

లింగ వివక్ష సమాజ, మహిళాభివృద్ధికి ఆటంకం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : లింగ వివక్ష వల్ల సమాజ, మహిళాభివృద్ధికి ఆటంకం కలుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. చట్టాలను అమలు చేయడం ఎంత ముఖ్యమో సమాజంలో మార్పు రావడం కూడా అంతే ముఖ్యమని, స్త్రీల పట్ల జరుగుతున్న హింసను నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై లింగ వివక్షను నివారించాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా గొల్లపూడి సచివాలయం నుండి నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుషుల మధ్య వివక్షత లేని నాడు నాగరికతతో కూడిన ఉత్తమ సమాజం ఏర్పడుతుందన్నారు. అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా మహిళలు కూడా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని, చట్టపరంగా, రాజ్యాంగ బద్ధంగా అందరికీ సమాన హక్కులున్నాయని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న లైంగిక, శారీరక, మానసిక హింసకు వ్యతిరేకంగా బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందని, లింగ వివక్షత నివారణతో మహిళాభివృద్ధికి మహిళా శిశు సంక్షేమ శాఖ సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. రాజకీయ, క్రీడలు, విద్యా రంగాల్లో మన దేశ మహిళలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నారని, మహిళ గర్భం ధరించగానే పుట్టబోయే బిడ్డ ఆడో, మగో తెలుసుకునే వైద్య విజ్ఞానాభివృద్ధిలో కూడా మహిళా శాస్త్రవేత్తలున్నారని తెలిపారు. తొలుత కూతురు, కొడుకు అనే తారతమ్యం లేకుండా విద్య, అభివృద్ధిలో సమాన అవకాశలు కల్పిస్తామని, బాల్య, బలవంతపు వివాహాలు, గృహ హింసను వ్యతిరేకిస్తామని, సమస్యలను పరిష్కరించుకునేందుకు ఎంతటి వారినైనా వదిలిపెట్టమని, చట్టాలను వినియోగించుకునేలా శాంతి సంఘీభావ సందేశాలను వ్యాప్తి చేస్తామని, స్త్రీలకు తగిన గౌరవమిచ్చి వారి హక్కుల కోసం నిలబడతామని, మహిళలపై హింస సామాజిక భాధ్యతగా చూసి వారు హక్కులను వియోగించుకునేలా కృషి చేస్తామని, హింసకు వ్యతిరేకంగా చేపట్టే కార్యక్రమంలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు శ్రీనివాసరావు, సునీత, ఉమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి నాగమణెమ్మ, రూరల్ మండలం ఎంపీడీవో జాహ్నవి, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు సీత, కార్యదర్శి రాణి, ఐసీడీఎస్ సీడీపీవోలు మంగమ్మ, నాగమణి పాల్గొన్నారు.

అందరికీ ఒకటే చట్టం

సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అందరికీ ఒకటే చట్టం వర్తిస్తుందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. శనివారం భవానీపురంలోని ఆర్యవైశ్య కార్తీక సమారాధన, వ్రతలను ఏర్పాటు చేసిన స్థలాన్ని జనసేన నాయకులు పోతిన వెంకట మహేష్, టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కార్తీక సమారాధన, వ్రతములకు పోలీసులు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, వాసవి ఫౌండేషన్ సంయుక్తంగా భవానీపురంలో ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రతాలు, కార్తీక వన సమారాధను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామ్యమని ఆయన అన్నారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లేదన్నారు. పరిపాలనా అట్టకెక్కిందన్నారు. రాష్ట్రంలో సెక్షన్ 144 నిరంతరం అమలు పరుస్తున్నారన్నారు. హిట్లర్ పరిపాలనా కొనసాతోందన్నారు. ఇదే సెక్షన్ 144 అములు ఉండగానే భవానీపురం శివాలయంలో సెంటర్ వైఎస్సార్ విగ్రహం ప్రారంభోత్సవానికి పోలీసులు బారికేట్లు, ట్రాఫిక్ ఆంక్షన్‌లు పెట్టి ప్రజలను నానా ఇబ్బందులు పెట్టారు. సత్యనారాయణ వ్రతలకు అనుమతి ఇవ్వాలని కోరారు. పోలీసులు అందరులు కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు చెప్పే విధంగా పోలీసులు నడుచుకుంటున్నారన్నారు. ఇతరలు పైనా కక్ష సాధింపు చర్యలుగా పోలీసులను అడ్డుపెట్టుకుని అధికార పార్టీ నాయకులు డ్రామాలు అడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.వి.భాస్కరరావు, టీడీపీ నాయకులు, బీజేపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శి ఉన్నం సాంబశివరావుకు పితృవియోగం

విశాలాంధ్ర-గంపలగూడెం : సీపీఐ మండల కార్యదర్శి ఉన్నం సాంబశివరావు తండ్రి ఉన్నం లక్ష్మయ్య (80) మృతి చెందారు. మండలంలోని సబ్బాలలో ఆయన స్వగృహంలో శనివారం నాడు మృతి చెందారు ఆయన భార్య కొంతకాలం క్రితం మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా, సీపీఎం మండల కార్యదర్శి గువ్వల సీతారాంరెడ్డి, నాయకులు మీసాల గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు, మద్దిరెడ్డి. వెంకటేశ్వర్‌రెడ్డి, చెరుకు వీరారెడ్డి, సబ్బాల సర్పంచ్ ఉన్నం కృష్ణారావు, తెలుగుదేశం నాయకులు కావూరి. శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బర్రెలక్కపై దాడి దుర్మార్గం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రజాస్వామిక దేశంలో ప్రతి ఒక్కరు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉందని కాని నేడు ఆ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే విధంగా తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కర్నె శిరీష(బర్రెలక్క) పై జరిగిన దాడిని జై ఆంధ్రా ప్రజాస్వామ్య వేదిక(జెడిఎఫ్) తీవ్రంగా ఖండించింది అధ్యక్షులు డాక్టర్ తరుణ్ కాకాని తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో యువత ప్రజాసేవ చేయాలనే ధ్యేయంతో ముందుకు రావాలని జేడీఎఫ్ బలంగా విశ్వసిస్తోందన్నారు.కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి శిరీష ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న శిరీష,ఆమె కుటుంబంపై జరిగిన దాడి చాలా దారుణం అన్నారు. తెలంగాణలో పట్టభద్రుల నిరుద్యోగ పరిస్థితి ఏంటని ఆమె ప్రశ్నించారు.అమె సొంతంగా ఆదాయం సంపాదించేందుకు గేదెల పెంపకం ప్రారంభించి తన సోషల్ మీడియాలో ఆన్‌లైన్ వీడియోను పోస్ట్ చేయగా అది వైరల్‌గా మారింది.అటువంటి ఆమెపై ప్రభుత్వం కేసు పెట్టి, వేధించటం దుర్మార్గం అన్నారు.శిరీషకు భద్రత కల్పించినందుకు ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు తెలుపుతున్నా అన్నారు. ఆమెకు తాము నైతిక మద్దతును అందించడమే కాకుండా, జెడిఎఫ్ ద్వారా ఆమె ఎన్నికల ఖర్చుల కోసం రూ.10,000 పంపిస్తున్నామన్నారు.కాకాని వెంకటరత్నం తన జీవితకాలంలో అనేక విద్యార్థి విప్లవాలకు నాయకత్వం వహించారని అందులో విశాఖ స్టీల్ ప్లాంట్ ఆందోళనలు, జై ఆంధ్ర ఉద్యమాలు ఉన్నాయన్నారు. జై ఆంధ్ర ఉద్యమానికి గుండెకాయలాంటి విజయవాడ బెంజ్ సర్కిల్‌లో కాకాణి వెంకటరత్నం విగ్రహాన్ని నెలకొల్పడం ద్వారా నేటి తరం యువతలో స్ఫూర్తి నింపేందుకు తాను, తన సంస్థ కేఏఎస్ఎస్-కాకాణి ఆశయ సాధన సమితి, జేడీఎఫ్-జై ఆంధ్రా డెమోక్రటిక్ ఫోరం ఎంతో పోరాటం చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి.ధనశేఖర్, ఉపాధ్యక్షురాలు లావణ్య పాములపాటి,కార్యదర్శి ఎన్.పవన్ కుమార్ పాల్గొన్నారు.

లారీ బోల్తా... రెండు కార్లు ధ్వంసం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ట్రాన్స్‌పోర్ట్ లారీ బోల్తా పడి రెండు కార్లు ధ్వంసమైన ఘటన విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం జానకీ పర్సల్ లారీ లోడ్డుతో ఒంగోలు నుంచి విజయవాడ వస్తుంది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో బెంజిసర్కిల్ కొత్త ఫ్లైవోవర్ దగ్గర బోల్తా పడింది. దీంతో రోడ్డు పై ఉన్న రెండు కార్లు ధ్వంసమైంది. ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో కృష్ణలంక పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

గుమ్మడి దుర్రు ఎంపీటీసీ రాజీనామా!

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండలంలోని గుమ్మడిదుర్రు గ్రామ ఎంపీటీసీగా 19-09-2021న ఎన్నికైన బారు సుధారాణి వ్యక్తిగత కారణాలతో ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. ఎంపీడీఓ సాయి హర్షకు రాజీనామా లేఖను అందజేశారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యం : శ్రీనివాస్

విశాలాంధ్ర-ఏ కొండూరు : రానున్న రోజులలో వైసిపి ప్రభుత్వానికి గద్దె దించడమే లక్ష్యం గ ప్రతి ఒక్క జన సేన టిడిపి కార్యకర్త పని చేయాలని తిరువూరు తిరువూరు నియోజకవర్గ జన సేన సమన్వయ కార్యకర్త మనుబోలు శ్రీనివాస్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం కోదూరు కొండూరు చీమలపాడు రేపుడి. అట్లా ప్రగాఢ రేపూడి అడ్డరోడ్డు తండా తదితర గ్రామాల్లో పర్యటించి రానున్న రోజులలో జనసేన టిడిపి ప్రభుత్వం అధికారం లోకి రావడం ఖాయమని అన్నారు. రాష్ట్ర లో రోజు రోజు కి పరిస్థితులు మరి పోతు న్నాయని వైసిపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుండీ ప్రతి ప్రక్షా పార్టీలు మీద కక్ష సాందిపు చర్యలకు పాల్పడుతుందని అన్నారు ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కు ఉందో లేదో తెలుసుకోవాలి అని ఓటు లేని వారు వెంటేనే ఓటు ను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. టిడిపి-జనసేన ప్రభుత్వం రావడం తథ్యమని సుపరిపాలన దిశాగ నూతన సచివాలయ నిర్మాణం అమరావతి లో చేపట్టడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఈరు పార్టీల నాయకులు సమన్వయము తో పనిచేసి టిడిపి జన సేన ప్రభుత్వానికి అధికారం లోకి తీసుకు వచ్చి ఆశీర్వదించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముది గొండ్ల సాయి లకావతు విజయ్ వెంపాటి యేసయ్య పసుపు లేటి సతీష్ జన సేన వీర మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగ వివక్షను నిర్మూలించాలి

విశాలాంధ్ర-కంచికచర్ల: సమాజంలో అక్కడక్కడా కనిపిస్తున్న లింగ వివక్షను సమూలంగా నిర్మూలించాలని డి పి ఎం శోభన్ బాబు,డిపిఎం లైవ్ లీ హుడ్స్ శోభారాణి ఎపియం భాస్కరరావు పేర్కొన్నారు. లింగ వివక్ష నివారణ మాసోత్సవాలను శనివారం కంచికచర్ల మండల కేంద్రము లో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి వారి చేత ప్రతిజ్ఞ చేయించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. లింగవివక్షతపై గ్రామా ల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీలు చేత జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. కూతురైనా, కొడుకు అయినా ఇద్దరికీ పుట్టిన రోజు వేడుకలు జరిపిస్తామని, కూతురు, కొడుకు వేరుఅనే తారతమ్యం చూపము.సమాన విద్య, ఎదుగుదల కోసం కూతురు, కొడుకు ఇద్దరికీ సమాన అవకాశం కల్పిస్తామని బాల్య మరియు బలవంతపు వివాహాలు వ్యతిరేకిస్తాము. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, చేయుత మహిళా మార్ట్ అధ్యక్షురాలు ముత్యల రోజరమణి, సెక్రెటరీ పుల్లమ్మ, సిసి లు యశోద, నరసింహారావు, రమణ, ప్రవంతి,ఎఫ్ పి ఒ సిసి అంజని, అకౌంటెంట్ వరలక్ష్మీ ఆపరేటర్ నవీన్,వివోలు బుక్ కీపర్ లు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో శాశ్వత రక్తదాతల కేంద్రం : డీఎస్పీ శ్రీకాంత్

విశాలాంధ్ర-గుడివాడ : వీకేఆర్, వియన్‌బి ఇంజనీరింగ్ కాళాశాలలో శాశ్వత రక్తం శిభిరం ఏర్పాటు చేయాడం అభినందనీయమని డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. శనివారం వికెఆర్ వియన్‌బి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా కరస్పాండెంట్, సెక్రటరీ వేములపల్లి కోదండ రామయ్య అధ్వర్యంలో శాశ్వత రక్తదాతల నిధి కేంద్రని ఏరియా అసుపత్రి సూపర్‌డెంట్ ఇందిరదేవితో కలసి డియస్‌పి శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం ప్రతి వ్యక్తి ప్రధాన అవసరమన్నారు. ఆరోగ్య పరిరక్షణలో రక్తం ప్రాధన్యత ప్రధానమన్నారు. కళాశాలలో ఈ కేంద్రం ఏర్పాటు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపల్ డా॥ ఎస్‌హెచ్‌వి ప్రసాదరావు, కళాశాల అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగా మాత స్త్రీ తత్వాన్ని ఆవిష్కరించిన త్రిపాది గంగ

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సిద్ధార్థ కళాపీఠం (సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ) నెలవారీ కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం సిద్ధార్థ ఆడిటోరియంలో పసుమర్తి రామలింగ శాస్త్రి నృత్య దర్శకత్వంలో ప్రదర్శితమైన త్రిపాది గంగ నృత్య రూపకం ఆద్యంతం పవిత్ర గంగా మాత లోని స్త్రీ తత్వాన్ని మూడు కోణాలలో ఆవిష్కరిస్తూ ప్రదర్శితమైంది. ఎస్ యామిని రెడ్డి (హైదరాబాద్)తన బృందంతో రమణీయగా ప్రదర్శించారు. ఎస్ యామినీ రెడ్డి, నరసింగరావు, ఎం సురేంద్రనాథ్, ప్రసాదరాయుడు, అరుణ, వాసు, సుష్మ,పద్మ,రాఘవ మురళి, తదితరులు గంగను తన సామాన్య నాయికి గా సర్వప్రాణికోటికి దాహార్తిని తీర్చుతూ గంగా మాత, శాపవశాత్తు గంగ భూలోకంలో శతన మహారాజుని వివాహం చేసుకొని జీవనం చేయటం పారకీయ నాయికగా, మహావిష్ణువు నుంచి ఆవిర్భవించి పరమేశ్వరుని జటాజూటాల నుండి జాలువారిన రెండు దశలలోనూ స్వీయ సంకల్పనాయికగా గంగా మాత తత్వాన్ని ఆవిష్కరిస్తూ వారి వారి పాత్రలలో అభినయిస్తూ నర్తించారు.

నందిగామలో న్యాయవాదుల ర్యాలీ

విశాలాంధ్ర-నందిగామ: భారత రాజ్యాంగం దినోత్సవం మరియు వరకట్న వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నందిగామ 16వ అదనపు జిల్లా కోర్టు ప్రాంగణం నుండి గాంధీ సెంటర్ వరకు న్యాయమూర్తులు ఆధ్వర్యంలో న్యాయవాదు లతో కలిసి ప్రత్యేకర్యాలీ నిర్వహించారు. నందిగామ జిల్లా కోర్టు 16వ అదనపు న్యాయమూర్తి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగం పై అవగాహన కలిగి ఉండాలని రాజ్యాంగం విలువలు హక్కులు తెలుసుకోవాలని తెలిపినారు. అవగాహన ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి వి లక్ష్మి రాజ్యం ,అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జున రావు, ఉపాధ్యక్షులు బొబ్బిలిపాడు భాస్కర్ రావు, ఏజీపీ మట్ట ప్రసాద్, దర్శి అర్జున్, ఏపీపీ ఈ రంగారావు, లీగల్ ఎయిడ్ షేక్. ఆజాద్, న్యాయవాదులు బొందలపాటి రామకృష్ణ, మన్నెం నారాయణరావు, షేక్ దాదా హుస్సేన్, కొమ్మినేని మౌళేశ్వరరావు, యర్రం రెడ్డి బాబురావు, టీవీ.శర్మ, షేక్.కరిముల్ల, ఎక్కిరాల హనుమంత రావు, అద్దంకి మణి బాబు, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S.No.115/2023
Between:
Vangara Nagaraju .... Petitioner/ Plaintiff
AND
1. Akkala Jaya Ramarao
2. Kandela Anjaneyulu
3. Pedaprolu Ramesh
4. Vodavelli Chakradhara Rao
... Respondents / Defendants

డి-3: పెదప్రోలు రమేష్ గారు, తండ్రి. మల్లేశ్వరరావు, డోర్ నెం. 32-15/1-70, బి.ఎస్.ఆర్.నగర్, 3వ లైన్, చుట్టుగుంట, విజయవాడ, ఎన్.టి.ఆర్.జిల్లా.
పై దావాలో మీరు మూడవ ప్రతివాది అయి వున్నారు. మీకు శ్రీ కోర్టువారి నుండి సమన్లు రిజిష్టరు పోస్టు ద్వారా ఎన్నిసార్లు పంపినను తీసుకొనందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియ పరచమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు ఈ ప్రకటన చూసిన తరువాత పై దావా తదుపరి వాయిదా ది.13-12-2023న ఉదయం గం.10.30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ లేదా అడ్వకేటు ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొన వలసినది. లేనియెడల పై దావాలో శ్రీ కోర్టు వారు మీ పరోక్షములో తీర్మానించగలరని తెలియ పరచడమైనది.
/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ///
యం. రామనాథ్, అడ్వకేట్
శేషాద్రిశాస్త్రి వీధి, గవర్నరుపేట
విజయవాడ విజయవాడ-520002
ది.25-11-2023 సెల్: 9440150556

IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.No.353/2023 in O.S.No.115/2023
Between:
Vangara Nagaraju ... Petitioner/ Plaintiff
AND
1. Akkala Jaya Ramarao
2. Kandela Anjaneyulu
3. Pedaprolu Ramesh
4. Vodavelli Chakradhara Rao
... Respondents / Defendants

డి-3:
దావాలో మీరు మూడవ ప్రతివాది (డి-3) అయిన పెదప్రోలు రమేష్ గారు, తండ్రి. మల్లేశ్వరరావు, డోర్ నెం. 32-15/1-70, బి.ఎస్.ఆర్.నగర్, 3వ లైన్, చుట్టుగుంట, విజయవాడ, ఎన్.టి.ఆర్.జిల్లా. మీకు శ్రీ కోర్టువారి నుండి సమన్లు రిజిష్టరు పోస్టు ద్వారా ఎన్నిసార్లు పంపినను తీసుకొనందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియ పరచమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు ఈ ప్రకటన చూసిన తరువాత పై దావా తదుపరి వాయిదా ది.13-12-2023న ఉదయం గం.10.30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ లేదా అడ్వకేటు ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొన వలసినది. లేనియెడల పై దావాలో శ్రీ కోర్టు వారు మీ పరోక్షములో తీర్మానించగలరని తెలియ పరచడమైనది.
/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ///
యం. రామనాథ్, అడ్వకేట్
శేషాద్రిశాస్త్రి వీధి, గవర్నరుపేట
విజయవాడ విజయవాడ-520002
ది.25-11-2023 సెల్: 9440150556

మహారాజశ్రీ గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల కమిషన్, విజయవాడ
ఎఫ్.ఎ నెం.396/2023
జి.కె.సాయిజన, భర్త : వి.సుబ్బరామ శివయ్య, నివాసం : శ్రీనగర్ కాలనీ, చిత్తూరు - 517001
- అప్పీలెంట్ / కంప్లైనెంట్
అండ్
ఆర్ 2) ది ఆథరైజ్డ్ పర్సన్, మెస్సర్స్ రాధా మాధవ్ ఆటోమొబైల్స్ (ప్రై) లిమిటెడ్, డోరు నెం. 4-151, ఎ.పి.సీడ్స్ కార్పోరేషన్, యన్.హెచ్.-5, ప్రసాదంపాడు, విజయవాడ రూరల్ మండలం, యన్.టి.ఆర్.జిల్లా.
- రెస్పాండెంట్ నెం-2 / ఆపోజిట్ పార్టీ
పై నెంబరు దావాలోని ప్రతివాదులకు నోటీసు శ్రీ గౌరవ ఎ.పి.స్టేట్ కన్స్యూమర్స్ రెడ్రెసల్ కమిషన్ వారు పబ్లికేషన్ ద్వారా ఆర్డర్ వేసియున్నారు. కావున సదరు 2వ ప్రతివాది వారు **ది.22-12-2023వ తేదీన ఉదయం గం.10.30** ని.లకు శ్రీ గౌరవ కమిషన్ వారి ముందు ప్రత్యక్షంగా గానీ లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియపర్చడమైనది.
(కమిషన్ వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 22-12-2023
Madhava Kumar Mandavelli, Advocate
#2-11, Yalala Bazar, Nunna - 521212, NTR Dist.
Cell : 98493 04162

CHANGE OF NAME
I, **BANDAVIRAMAM SAMATHA** (Old Name), W/o. **BANDAVIRAMAM VENKATA SATYANARAYANA**, Resident of Flat No. 102, SK. Towers, B.R.P.Road, Islampet, Vijayawada, NTR District, A.P., have changed my name from **BANDAVIRAMAM SAMATHA** (Old Name) to **BANDAVIRAMAM SAMATA** (New Name). Hereafter my name is known as **BANDAVIRAMAM SAMATA.**

SUMMONS
IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT JAGGAIAHPETA
O.S. No. 70 of 2023
Between:-
Bojja Kalavathi.... **Plaintiff**
and
Bojja Venkatanarayana & 5 others. ... **Defendants.**
Defendant No.3:-
Bojja Ravi Kumar son of Satyanarayana, Hindu, aged about 40 years, Properties, Door No.6-450/3, Seetharamapuram, Jaggaiahpeta-521175, N.T.R.District.
Whereas the plaintiff has instituted a suit against you, the plaint mentioned relief vide plaint copy attached herewith, you are hereby summoned to appear in the Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on the **8th day of December-2023** at **10-30 O'clock** in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defense.
Take noticed that, in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.
//By order of Hon'ble Court//
B. Venkata Ramaiah.
Advocate for plaintiff. Jaggaiahpeta-521175. N.T.R. District. A.P.

రైల్వే అండర్ బ్రిడ్జిని పూర్తిచేయాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : మధురానగర్‌లో నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసురావాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మధురానగర్‌లో నగర పాలక సంస్థ అద్వర్యంలో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధురానగర్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. రూ.15 కోట్లు వ్యయంతో నిర్మిస్తున్న రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జ్ ప్రాజెక్టు పనుల్లో, దాదాపు రూ.6.5 కోట్లతో రిటైనింగ్ వాల్, కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొంత వరకు పూర్తి కాగా ఇంకా రూ.8.5 కోట్ల తో మిగిలిన నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలతన్నారు. అనంతరం 26, 1వ డివిజన్లలోని ఏలూరు రోడ్‌లో పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఫుట్‌పాత్‌లపై ఉన్న అనధికార ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. మురుగు కాలువల్లో సిల్టును ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని శానిటరీ ఇనస్పెక్టర్లును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కెన్నెడీ హైస్కూల్‌లో క్రీడా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ రూరల్ మండలం నున్న కెనడీ హైస్కూల్‌లో వార్షిక క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీటీవి రమణ, స్పోర్ట్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ గోపాలకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు, క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి అతిథులు జీటీవి రమణ, గోపాల కృష్ణకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం గెలుపొందిన జట్లకు, క్రీడాకారులకు అతిథులు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా జీటీవి రమణ మాట్లాడుతూ క్రీడలు, ఆటలు ఆడటం వల్ల విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. అలాగే, క్రీడలు, ఆటలలో గెలుపొందిన సర్టిఫికెట్లు ఉన్నత విద్యా కోర్సులతో పాటు ఉద్యోగాల్లోకి ప్రవేశాలు పొందేందుకు అదనపు ప్రయోజనంగా ఉంటాయన్నారు. కెనడీ హైస్కూల్ చైర్మన్ సత్య రామకృష్ణ, డైరెక్టర్ సాయి తేజ కశ్యప్, ప్రిన్సిపాల్ రత్న కృష్ణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అప్పల రాజు పాల్గొన్నారు.

పేదలకు యార్లగడ్డ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-హనుమాన్ జంక్షన్ : అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు చికిత్స నిమిత్తం గన్నవరం నియోజవర్గ టీడీపీ ఇంఛార్జి యార్లగడ్డ వెంకట్రావ్ ఆర్థిక సాయం అందించారు. బాపులపాడు మండలంలోని సిరివాడ ,కానుమోలు,హనుమాన్ జంక్షన్ గ్రామాల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాణాల పున్నయ్య(జంక్షన్)కు 20,000 రూపాయలు, నీలం రాయప్ప (సిరివాడ) 10,000 రూపాయలు ,కానుమోలు(కె. బుడ్డియ్య)10, 000 రూపాయలు అందించారు. వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీశ్ చేతుల మీదుగా సహాయం అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, చెడుగొంది శివ శంకర్, ఏర్రుబోయిన కుమార స్వామి, తంగెళ్ళముడి రత్నం,నీలం సంసోను, మెడబలిమి ఏసుపాదం పాల్గొన్నారు.

అన్నదానంకు రూ.10,116 వేలు విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి ఆలయం లో జరుగు అన్నదానం కు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామ వాస్తవ్యులు ముక్క పాటి.చలపతిరావు,మాలతి దంపతులు,ఆలయ కార్య నిర్వహణ అధికారి మరియు డిప్యూటీ కలెక్టర్,కే రమేష్ నాయుడు సూచనల మేరకు శ్రీ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు పదివేల 116 రూపాయలు ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ కుశనివారం అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనేశ్వర పూజలు

విశాలాంధ్ర-నందిగామ : క్షేత్రాలలో కార్తీక మాసం శని త్రయోదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు, శనివారంనందిగామ రామలింగేశ్వర స్వామి దేవాలయం లో, భాస్కర నంద ఆశ్రమల్లో నవగ్రహాలకు విశేష అర్చనలు, శనిఈశ్వరునికి గ్రహ పీడ నివారణ అర్థం తైలాభిషేకాలు అర్చక స్వాములు బాలకృష్ణ శాస్త్రి వైయస్కారకే శర్మ,,ఆంజనేయ ప్రసాద్ శర్మ ,శేష సాయి శర్మ, వైదిక సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయాలు శివ శనీశ్వర నామస్మరణతో మారు మోగాయి.

జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు కేబీఎన్ విద్యార్థి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తమ కళాశాల విద్యార్థి ఇటీవల రోలర్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీల్లో హాజరు కానున్నాడని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు తెలిపారు. తమ కళాశాల విద్యార్థి మొదటి ఏడాది బీకాం చదువుతున్న రత్నరాజు జిల్లా స్థాయిలో మూడు గోల్డ్ మెడల్స్‌ను సాధించి ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి రోలర్స్ స్కేటింగ్‌లో బంగారు, కాంశ్య, రజిజత పతకాలను సాధించిన్నట్లు పేర్కొన్నారు. త్వరలో చెన్నైలో జరగబోయే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక కాబడ్డాడని తెలిపారు. ప్రతిభ చూపిన రత్నరాజును, అతనిని తీర్చిదిద్దిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డీ హేమచంద్రరావుని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు ఇతర అధ్యాపకులు అభినందించినట్లు వివరించారు.

పదవీ విరమణ చేసిన హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): పదవీ విరమణ పొందిన హోంగార్డ్ కుటుంబానికి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు ఆర్థిక సహాయం అందించారు. నగరంలో పనిచేస్తున్న హోంగార్డ్‌లో ఎవరైనా మరణించినా, పదవీ విరమణ చేసిన వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా నగరంలో పనిచేస్తున్న హోంగార్డ్ అందరూ స్వచ్చందంగా వారికి వచ్చే వేతనం నుంచి చనిపోయినా కుటుంబాలకు, పదవీ విరమణ పొందిన వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈక్రమంలో నగరంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ సత్యనారాయణ పదవీ విరమణ పొందారు. దీంతో మోకా సత్తిబాబు అతనికి రూ. 5లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ తదతదితరుల పాల్గొన్నారు.

శృతిలయల సమ్మేళనం యువ సంగీత సమ్మేళనం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సంగీత విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తూ, వర్ధమాన కళాకారులకు వేదికను కల్పించి ప్రోత్సహిస్తూ, ఉన్నతశ్రేణి సంగీత విద్వాంసుల సంగీత కచేరీలు ఏర్పాటు చేస్తూ శాస్త్రీయ సంగీత పరిరక్షణ చేస్తున్న శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నెలవారీ సంగీత కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం ఘంటసాల సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలోని కళావేదికపై జరిగిన యువ సంగీత సమ్మేళనం సుస్వరాలను పండిస్తూ శృతిలయల సమ్మేళనంగా సాగింది. ప్రారంభంలో డి ప్రజ్ఞ వీణావాదనం సునాదాన్ని పంచుతూ జరిగింది. అనంతరం వర్ధమాన గాయకుడు, వయోలిన్ కళాకారుడు బివిఎస్ శ్రీకృష్ణ, డివిఎన్ఎస్ మనసిజల వయోలిన్ ద్వయ వాయిద్యం శృతిలయల సమ్మేళనంగా హంసధ్వని రాగంలో వాతాపి గణపతి తో ప్రారంభించి వరుసగా లతాంగిలో మరివేరే దిక్కెవరు, ఖరహరప్రియలో రామ నీ సమాన మెవరురా వంటి కృతులతో అభినందనీయంగా జరిగింది. చివరిగా పి నాగపూజిత గానం శృతి శుద్ధతతో శ్రవణానందకరంగా సాగింది. ఈ కార్యక్రమాలకు మృదంగంతో సిహెచ్ సూర్య, వయోలిన్ తో మనసిజ లు అనుకూల సహకారమందించారు.

వైణిక విద్వాంసురాలు సుశీలాగోపాలం కు ఘన సత్కారం..

అదే వేదికపై ప్రఖ్యాత వైణిక విద్వాంసురాలు చివుకుల సుశీలాగోపాలం కు ఘన సన్మానం జరిగింది. పర్యవేక్షణ సమితి ప్రధాన కార్యదర్శి సివి రావు చేశారు. ముఖ్య, గౌరవ అతిథులుగా సుప్రసిద్ధ గాత్ర సంగీత విద్వాంసుడు, వారసత్వంగా వస్తున్న సంగీత సంపదను పరిరక్షిస్తున్న మల్లాది శ్రీరామ్ ప్రసాద్, ప్రసిద్ధ గాత్ర సంగీత విద్వాంసుడు, ఎటువంటి ఫలాపేక్ష లేకుండా వందల మందికి సంగీత విద్యను అందిస్తూ వారిని ఆ రంగంలో తయారుచేస్తూ సంగీత మాతకు విశిష్ట సేవలందిస్తున్న పోపూరి గౌరీనాథ్ లు మాట్లాడుతూ ఆకాశవాణిలో గుర్తింపు పొందిన వీణ విద్వాంసురాలిగా సుశీల గోపాలం శృతిలయలను మేళవించి సునాదాన్ని పండిస్తూ వందల కచేరీలు చేసి తనకొక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వైణికురాలు అని అటువంటి వారిని సంస్థ సత్కరించటం ఎంతో సముచితమన్నారు.

అన్నదానం

విశాలాంధ్ర-గుడివాడ : అన్ని దానాలలో కెల్లా అన్నదానం శ్రేష్టమైనది, అమ్మవారి కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని టిడిపి నాయకులు వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక పుల్లలపాడు వంతెన వద్ద ఉన్న అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల ఘనంగా నిర్వహించిన సందర్భంగా శాంతి నిమిత్తం ఓల్డ్ ఐరన్ మర్చంట్స్ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ అతిధులుగా టిడిపి నాయకులు వెనిగండ్ల రాము, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మజ్జి శ్రీనివాస్, మిక్కిలినేని రమేష్, పెద్దింటి రమేష్, పొగిరి రమణ, వల్లూరి గణపతి, వల్లూరి పారయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాలలో వికసిత్ సభలు

విశాలాంధ్ర-పెదపారుపూడి : వికసిత్ భారత్ సంకల్పయాత్ర మండలంలోని యలమర్రు, ఈదుల మద్దాల,చినపారుపూడి, మోపర్రు, గ్రామాలలోని ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభ సమావేశాలు నిర్వహించినట్లు ఎంపీడీవో, నోడల్ అధికారి టి సీతామహాలక్ష్మి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు అందిస్తున్న 17 సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించడం, లబ్ధిదారులతో మాట్లాడించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించటం, క్విజ్ పోటీలు నిర్వహించటం, ప్రతిభతో రాణిస్తున్న క్రీడాకారులను సన్మానించడం, పోటీలలో విజేతలకు బహుమతులు అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, తహసిల్దార్ వి నాగభూషణం, యలమర్రు సర్పంచ్ కొల్లూరు అనూష, ఈదుల మద్దాల సర్పంచ్ వంగర హిమబిందు విష్ణుకుమారి, చినపారుపూడి సర్పంచ్ నగుళ్ల శ్రీనివాసరావు, మోపర్రు ఉపసర్పంచ్ జూపల్లి కమల కుమారి వివిధ శాఖల అధికారులు, మూడు పీహెచ్సీల వైద్యులు, లబ్ధిదారులు పాల్గొన్న సభలకు వ్యాఖ్యాతగా మండల ఈవో పి ఆర్ డి వంగా శ్రీనివాస్ (వంశీ) వ్యవహరించారు.

చంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-అవనిగడ్డ : సిటి కేబుల్ రిపోర్టర్ కళ్ళేపల్లి చంద్ర కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. చల్లపల్లికి చెందిన చంద్ర ఆర్థిక ఇబ్బందులతో కుమారు హాస్టల్ ఫీజు కూడా కట్టలేని పరిస్థితిలో ఈ నెల 11 వ తేదిన ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయంపై స్పందించిన దాతలు స్వచ్చందంగా ఆర్థిక సహాయం అందచేస్తున్నారు. అందులో భాగంగా శనివారం పంచాయితీ రాజ్ డి.ఇ బండారు వెంకటేశ్వరరావు జె.ఇ లు నడకుదిటి వాసుదేవరావు, వి విజయ్ కుమార్‌లు కలిసి తన కార్యాలయంలో 10 వేల రూపాయలను ప్రస్‌క్లబ్ సభ్యులు సీనియర్ జర్నలిస్ట్ దివి సారంగపాణి అయ్యంగార్ లకు నగదు అందచేశారు. శారదా విద్యానికేతన్ యు.పి స్కూల్ కరస్పండెంట్ ఎన్.ఆర్.ఎస్.ఎస్ ప్రసాద్ ఆద్వర్యంలో ప్రిన్సిపాల్ కళ్యాణి 2 వేల రూపాయలను సీనియర్ జర్నలిస్ట్ కోట సుబ్బారావుకు అందచేశారు. ఈ కార్యక్రమంలో అలపర్తి గోపాలకృష్ణ, సింహాద్రి జయరామ్, చందు శ్రీనివాసరావు, ఇమ్మడిశెట్టి రామారావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

రాయపూడిని నల్లమ్మ మామ్మ పరామర్శ

విశాలాంధ్ర-అవనిగడ్డ : జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావును సమస్యలపై పోరాటం చేసే లంకమ్మమాన్యంకు చెందిన నల్లమామ్మ శనివారం పరామర్శించింది. 90 సంవత్సరాల వయస్సులో కూడా నల్లమ్మ మామ్మ 7 వ వార్డులోని రాయపూడి వేణుగోపాలరావు ఇంటికి వెళ్ళి ఆరోగ్య విషయాలను తెలుసుకుని ఓదార్చింది. ఆమె ఓదార్పుకు రాయపూడి కళ్ళ వెంబడి నీళ్ళు పెట్టుకుంటూ సమస్యలపై నీ పోరాటమే మాకు ఆదర్శం అని, కరోన సమయంలో ఒంటరిగా కరోనాతో పోరాడి మన అందరి మధ్యలో నవ్వుతూ తిరుగుతూ తన ఇంటి ముందు రోడ్డు కోసం పోరాటం చేసి విజయం సాధించిందని ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారి నిర్మాణం చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు. నేను ఆసుపత్రి నుండి ఇంటికి వచ్చిన విషయం తెలుసుకుని ఈ వయస్సులో నడుచుకుంటూ నా కోసం పండ్లు తీసుకుని వచ్చి ఆప్యాయతగా దగ్గరకు తీసుకుని అయ్యా ఆరోగ్యం బాగుందా అని అడిగి ఓదార్చుతుంటే ఆమె ఆప్యాయత ముందు నాకు కన్నీళ్ళు ఆగలేదు. ఈమె లంకమ్మ మాన్యం లో ఎన్నో సమస్యలు కోసం పోరాటం చేసింది. ఈ రోజు నా దగ్గరికి వచ్చి నా ఆరోగ్య విషయంలో మనోనిబ్బరం కలిగించిన నల్లమ్మ మామ్మకు నా శిరస్సు వంచి పాదాభివందనం చేసి అభినందించారు.

పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలకు భక్తులు పోటెత్తారు. మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో వేంచ్చేసి ఉభయ ముక్తేరశ్వర స్వామి వారి ఆలయంలోని పార్వతి అమ్మవారికి కార్తీక మాస పూజల్లో భాగంగా శనివారం అమ్మవారికి ఆలయ అర్చకుల ఆద్వర్యంలో లక్ష కుంకుమ పూజా అర్చనలు నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించి దర్శించుకుని తీర్ధప్రసాదాలు స్వీకరించారు.

20వ వారం కొనసాగిన అన్నదానం

విశాలాంధ్ర-అవనిగడ్డ : డొక్కా సీతమ్మ స్పూర్తితో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గరికిపాటి రామ్, వివేక్ మరియు మిత్రబృందం ఆద్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానం శనివారం 20 వ వారం కొనసాగింది. వంతెన సెంటర్‌లోని కోనసీమ కోడి కూర కొబ్బరి అన్నం ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో జరుగు జాన్సీరాణి జ్ఞాపకార్ధం వారి తండ్రి ముక్తేశ్వరరావు 200 మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సి సభ్యులు బొప్పన బాబు, తోట ఆంజనేయులు పలువురు జనసైనికులు సహకరించి సేవలందించారు. సేవలందించిన ప్రతి ఒక్కరికి గరికిపాటి రామ్ అభినందనలు తెలియచేశారు.

రూ.3.28 కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణం

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడలో దశాబ్దాల సమస్యల పరిష్కారానికి సిఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని, వేలాది కోట్లతో గుడివాడను అభివృద్ధి చేస్తున్న తమను దోపిడిదారుడు అంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని మాజీ మంత్రి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. శనివారం స్థానిక 15వ వార్డులో నూతనంగా నిర్మించిన 3కోట్ల 28లక్షల నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే కొడాలి నాని, కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికతో కలిసి ఎంపి వల్లభనేని బాలశౌరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి బాలశౌరి మాట్లాడుతూ 4ఏళ్ల 8నెలల వైసిపి పాలనలో 98శాతం మ్యానిఫెస్టో హామీల అమలు చేసిన పేదల పక్షపాతి సీఎం జగన్ అన్నారు. సామాన్య ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చడానికి సీఎం జగన్ ప్రభుత్వ ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

2వందల కోట్లతో జల్ జీవన్ మిషన్ నిధులతో గుడివాడలో త్రాగునీటి ప్రాజెక్ట్‌ల నిర్మాణం చేశామన్నారు. కొడాలి నాని మాట్లాడుతూ గుడివాడలో ఏమైనా ఇసుక రిచ్‌లు, గ్రానైట్ క్వారీలు ఉన్నాయా దోపిడీ చేయడానికి అన్నారు. ఎక్కడెక్కడో డబ్బు తెచ్చి గుడివాడ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నా తనను విమర్శిస్తున్న టీడిపి నేతలు, తమ హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గుడివాడలో తనకు బంధువులు ఉన్నారని చెప్పుకునే చంద్రబాబు 14 ఏళ్ళు సీఎంగా ఉండి గుడివాడ అభివృద్ధికి ఏం చేశాడో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కోటి దీపోత్సవం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఆదివారం సాయంత్రం దివిసీమ కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వీరాజిల్లుతున్న గ్రామదేవత లంకమ్మ అమ్మవారి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కోటి దిపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అన్నపరెడ్డి రామదాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దీపోత్సవాన్ని తిలకించి అమ్మవారిని దర్శించుకుని తీర్ధప్రసాదాలను స్వీకరించి విజయవంతం చేయాలని కోరారు.

30న రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈ నెల 30 వ తేది గురువారం ఉదయం 9 గంటలకు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ చైర్మన్ వంగర శేషగిరి రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ వారి బంగారు పతాక గ్రహీత బొండాడ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డి.ఎం.డి బొండాడ రాఘవేంద్ర సహకారంతో తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో రక్తదాతలు, యువతి యువకులు, ఉద్యోగస్థులు, వ్యాపారస్థులు, రెడ్‌క్రాస్ సొసైటీ జీవిత కాల సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని వంగర కోరారు.

డిసెంబర్ 9న మృత్యుంజయ హోమం

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాజరాజేశ్వరి సహిత రాజశేఖర స్వామి వారి దేవస్థానంలో మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సింహాద్రి రామనాధన్ బాబు ఆలయ కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజరాజేశ్వరి సహిత రాజశేఖరస్వామి వారి దేవస్దానం (శివాలయం) నందు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కార్తీక బహుళ ద్వదశి డిసెంబర్ 9 వ తేది శనివారం నాడు స్వామి వారికి విశేషంగా రుద్రహోమం, మృత్యుంజయ హోమం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమాలు ఆలయ అర్చకులు ఘంటశాల పవన్ కుమార్ శర్మ ఆద్వర్యంలో నిర్వహిస్తున్నట్లు భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్ధప్రసాదాలు స్వీకరించి స్వామి వారి ఆశీసులు పొందాలన్నారు.

డాక్టర్ షమా సుల్తానాకు 'నేషనల్ ప్రెసిడెంట్ అప్రిషియేషన్ అవార్డు'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నిత్యం ప్రజలకు అందుబా టులో ఉంటూ అతి తక్కువ ధరకే వైద్య సేవలు అందిస్తున్న హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, ఫౌండర్ ఆఫ్ యువనారి హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ ఆఫ్ పబ్లిక్ అవేర్‌నెస్ కమిటీ ఐఎంఎ డాక్టర్ షమా సుల్తానాకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు 'నేషనల్ ప్రెసిడెంట్ అప్రిషియేషన్ అవార్డు' దక్కింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వార్షికోత్సవ అవార్డుల (2023)లో భాగంగా ఈ అవార్డును ఐఎంఎ జాతీయ ప్రెసిడెంట్ డాక్టర్ శారద్ అగర్వాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ జి.రవికృష్ణల చేతులు మీదుగా డాక్టర్ షమా సుల్తానా అందుకున్నారు. గుంటూరులో ప్రజా చైతన్య కార్యక్రమాలలో వ్యక్తిగత ప్రతిభ చూపినందుకు ఐఎంఎ వారు డాక్టర్ షమా సుల్తానాకు ఈ అవార్డును అందజేశారు. ఈ అవార్డు తీసుకున్న సందర్భంగా విజయవాడలోని డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమి వారు డాక్టర్ షమా సుల్తానాను ఘనంగా సత్కరించారు.

మహిళా కళాశాలలో ఘనంగా దీక్షారంబ్

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళా శాల(స్వయం ప్రతిపత్తి) లో నూతన విద్యార్థులకు స్వాగతం పలికే దీక్షా రంబ్ 2023-24 కార్యక్రమం ఉత్సాహంగా, స్ఫూర్తివంతంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విద్యావేత్త, కమ్యూనిటీ బిల్డర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నరేష్ చిగురుపాటి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో అన్ని రంగాలలో తొలి అడుగులు మహిళలవేనన్నారు. సుప్రీంకోర్టు న్యాయ వాది మన్నవ ఆర్‌కేఎం షోడేకర్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలకు దూరంగా... తమ ముందు ఉన్న బాధ్యతలను గుర్తు ఎరిగి రాణించాలని చెప్పారు. ఏడవ అడిషనల్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.జోత్స్న మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన ప్రభుత్వ మహిళా కళాశాల తనలాంటి వేలాది మంది జీవితాలలో వెలుగులు నింపిందని అన్నారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ వీఆర్ జోత్స్నకుమారి అధ్యక్షత వహించగా స్టూడెంట్ యూనియన్ కన్వీనర్ కె.సుబ్బరత్నం, ప్రెసిడెంట్ కె.ప్రియశ్రీ, డాక్టర్ పి.విజయలక్ష్మి, డి.ఉమా, టి.ప్రణయజ, ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ ఒలంపియాడ్‌లో రన్నర్‌గా డాక్టర్ వై.షేక్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ నెల 24న విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇండియన్ మెడి కల్ అసోసియేషన్ (ఐఎంఎ) వారు నేషనల్ డాక్టర్స్ ఒలంపియాడ్-2023 టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించారు. అయితే నేషనల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై. షేక్ డబుల్స్ టెన్నిస్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపరచి రన్నర్‌గా నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. శనివారం స్థానిక ఎత్తు రోడ్డు సెంటర్‌లో ఉన్న ఆయన గృహంలో మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు నిర్వహిం చిన నేషనల్ డాక్టర్స్ ఒలంపియాడ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో రన్నర్‌గా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఆటలు ఆడటం వలన స్కిల్స్ పెంపొంది అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో..కాలేజీల్లో ఆటలకు ప్రత్యేకంగా క్లాసులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. శారీరక దృఢత్వాన్ని పొందటమే కాకుండా ఆరోగ్యంగా కూడా ఉండగలరని అన్నారు.

వాలీబాల్ పోటీల్లో జెఎంజే కళాశాల ప్రథమ స్థానం

విశాలాంధ్ర, తెనాలి : స్థానిక జె.యం.జె. కళాశా లలో గత రెండు రోజులుగా జరుగుతున్న మహిళా వాలీ బాల్ పోటీలు శనివారం ముగిశాయి. మొదటి స్థానంలో నిలిచిన జె.యం.జె. కళాశాల జట్టు ట్రోఫీని కైవసం చేసుకోగా, రెండవ స్థానాన్ని డి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఒంగోలు వారు కైవసం చేసుకున్నారు. యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వారు మూడవ స్థానాన్ని సాధించుకు న్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుంటూరు వారు నాలుగో స్థానాన్ని పొందారు.